# కృతజ్ఞతలు

యజమాని ఉద్దేశాన్ని జీవి తన దగ్గర సఫలం కానివ్వటమే జీవి యజమానికి చెల్లించుకునే నిజమైన కృతజ్ఞతలు. జీవి తన సమస్తానికి ప్రభువు అయిన అఖండ పరిపూర్ణ పరబ్రహ్మకు ఈ విధంగా కృతజ్ఞతలు తెలియ చేసుకుంటోంది.

❋ తండ్రీ! భ్రమలు లేని క్షణంలో జీవి కూడా భగవంతుడే అని తెలియ చేసావు దానితో నాకు విజయం తప్పక కలుగుతుందన్న ఆశ చిగురించింది. నన్ను నాకు కాబోయే విజయుడిగా పరిచయం చేసినందుకు నీకు కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాను.

❋ జీవి బాగుపడాలన్న నీ ఉద్దేశమే నాతో పాటు చరిస్తూ నన్ను కాపాడుతోంది. జీవితో నిరంతరం చరించేది ప్రేమ అన్నావు నీవు, అంటే జీవి బాగుపడాలన్న నీ ఉద్దేశమే ప్రేమ కదా తండ్రీ! నీ ప్రేమకు కృతజ్ఞతలు, ఆప్రేమను అర్థం చేయించినందుకు కృతజ్ఞతలు.

❋ ఉందిగా దానిని పని చేయనీ అని నీవు ఆజ్ఞ వేశావు! ఆ ఆజ్ఞను ఒప్పుకున్నప్పుడు కర్త, కర్మ, క్రియ, ఫలము, ఫల భోగము అనే పేర్లతో అయిదుగా వున్న వస్తువు ఒకటై పోయింది దానితో అక్కడ కర్మ జరిగిన జాడ (trace) కూడా లేకుండా పోయింది. Trace out కాకుండా పనిచేయటం నీ సత్తా అది నాలోనూ ప్రతిఫలింప చేసినందుకు నీకు కృతజ్ఞతలు. నా సరుకులో ఇంకా నాణ్యత రానేలేదు అయినా సత్తాని ప్రసాదిస్తున్న నీకు నీ కరుణకు సర్వదా కృతజ్ఞుడిని.

❋ నేను నా సైన్యాన్ని గుర్తించలేక సైన్యమే నాకు అవరోధంగా భావించి వాటిని అణచి వేస్తుండగా నీవు నిరాధారంగా కృపను కురిపించావు. ఆ కృప అనే తాళపు చెవి వల్ల నా ఖజానా (సైన్యము) విలువ నాకు అర్ధమైంది. నా సైన్యము నాకు ఉపయోగపడితే అది సత్యము, నేను సైన్యానికి అలవాటు పడితే అది మాయ అని అర్ధమైనది. నిరోధించాల్సినది సైన్యాన్ని కాదు వాటికి అలవాటు పడుతున్న నా నైజాన్ని అని గుర్తించాను. దానితో ప్రయత్నము నుండీ అన్వేషణ నుండీ విడుదల పొంది కాలాన్ని వృధా కాకుండా కాపాడుకోగల్గాను.

మాయయొక్క రహస్యము, ఖజానా యొక్క విలువ నాకు తెలిసిందంటే అది నీ కృప వల్లే దానికి కృతజ్ఞతలు! అంతటి శుభాలను ప్రసాదించే నీ కృపను నాపై నిరాధారంగా కురిపించావే అది నీ ఔదార్యము. నీ ఔదార్యానికి కృతజ్ఞతలు!

❊ నేను నా ఖజానా గొప్పతనానికి మైమరిచిపోకుండా వుండేందుకు నాచేత స్వధర్మము అనే ఆయుధాన్ని ధరింపచేసావు అందుకు కృతజ్ఞతలు! నీవు నాకు స్వధర్మాచరణ నేర్పటం వలన నేను ఖజానాను కాక దానికి ఆధారమైన నిన్ను గమనించడం అలవరచుకున్నాను. నిన్నే గమనిస్తున్నప్పుడు నేను ఎక్కడా ఇరుక్కుపోకుండా స్వేచ్ఛగా వుంటూ సుఖాన్ని అనుభవిస్తున్నాను. నిన్ను గమనిస్తున్నప్పుడు నాలోని అలజడి సర్దుమణిగి సుఖంగా వుండగల్గుతున్నాను. నా సుఖానికి కారణమైన నీకు నీ సత్తాకు కృతజ్ఞతలు!

❊ కేవలము నిన్ను మాత్రమే గమనిస్తున్నప్పుడు నీపై ఆశ కానీ, నీ పదవిపై వ్యామోహంకానీ, నీ సత్తాపై ఈర్ష్యకానీ, నాపై నాకు న్యూనత భావం కానీ కలుగకుండా చేసి నాలో పరిశుద్ధత నిలిపినందుకు నీకు కృతజ్ఞతలు.

ఇప్పుడు నేను సుఖించటానికి నీ సత్తా నీ మహిమ అనే ఆధారాలు కూడా అవసరం లేకుండా పోయింది. నీవు ప్రసాదించిన ఈ నిర్విషయ సుఖానికి కృతజ్ఞతలు.

❋ నీ సహజత్వాన్ని గమనించినప్పుడు నేను, "నాది" అనే పెంకును పగలకొట్టుకుని బయటకి వచ్చి, అనవసరమైన కవచాలను (స్థితులు) కోల్పోయి నీవు ధరించిన సహజత్వమనే వస్త్రాన్నే ఆభరణంగా ధరించాను. నీవు ప్రసాదించిన ఈ ఆభరణానికి కృతజ్ఞతలు.

❋ "నాది" అన్న గూడులోంచి బయట పడ్డ నేను ఏ ఇతర ప్రభావాలలో కాక నీ ప్రభావంలోనే వుండాలని, నేను నా పద్ధతి ప్రకారం కాక నీ పద్ధతి ప్రకారం నడవాలన్నది నీ చిత్తమై వున్నదని గమనించాను. దానితో నేను నా పద్ధతిలో నా ప్రణాళికలో ఇరుక్కోకుండా స్వతంత్రుడి గానూ, నీ ప్రణాళిక ప్రకారం వుంటూ శరణాగతునిగానూ ఏక కాలంలో వుండగల్గుతున్నాను. శరణాగతిని, స్వతంత్రాన్ని నేర్పించి రెండిటినీ ఏక కాలంలో నిలుపుకునే మెళకువను నేర్పించిన నీ గురుతత్వానికి నా కృతజ్ఞతలు.

❋ నీ చిత్త ప్రకారము వున్నప్పుడు నా సమస్తమూ అనగా నేను, నా మార్గము, నా గమ్యమూ అన్నీ ఫలించాయి. నేను ఇష్టప్రకారం ఏర్పర్చుకున్న నా గమ్యం (యజమాని

దర్శనం) దాకా చేరినప్పుడు నా గమ్యము నన్ను బంధించకుండా నన్ను ముందుకు పోనిచ్చింది. నీ దర్శనానికే కరిగిపోనీక మరింత ముందుకు పోనిచ్చి నీ నా సమస్తాన్ని ఫలింపచేసావు సర్వ విధాలా పరిపూర్ణతను ప్రసాదించావు సర్వ పరిపూర్ణాన్ని ప్రసాదించిన నీకు కృతజ్ఞతలు.

❋ నీ ఔదార్యానికి, నీ ప్రేమకి, నీ కరుణకి, నీ సత్తాకి, నీ గొప్పతనానికి, నీ గురుత్వానికి సాక్షిగా వున్న నేను ఆశ్చర్యపడుతూ నా సర్వస్వం కోల్పోయి ఉనికిగా మారాను. గమనింపుకు కూడా అతీతమై నిమిత్త మాత్రంగా వున్న నన్ను నీవే నీతి నిజాయితీలు అనబడే పట్టాలు ఎక్కించి నాకు కావల్సిన ఆహారాన్ని అందించావు. నీ పోషణకు కృతజ్ఞతలు.

❋ కేవలం ఉనికిగా వున్న నాలో ప్రవర్తన ఆగిపోయింది. నాలో ఏ వ్యాపారం లేక పోయినా చైతన్యాన్ని కలిగి వున్నాను. వున్న చైతన్యం ప్రవర్తించకుండా వుంటోంది. వ్యాపారం లేక పోవటంతో దేదీప్యమానమైన చైతన్యము అనగా మౌనంలో చైతన్యము, చైతన్యము ప్రవర్తించక పోవటంతో చైతన్యములో మౌనాన్ని కలిగివున్నాను. ఉనికిగా వుంటూ పై లక్షణాలతో అలరారుతున్న నాకు

నీతో అనుసంధానం ఏర్పడింది. నీలో వున్న నిజలక్షణం నాలోనూ ప్రతిఫలింప చేసి, దానినే నా యోగ్యతగా చూపించి నాతో అనుసంధానం చేసిన నీకు నీ చతురతకు కృతజ్ఞతలు

❋ నీతో అనుసంధానం ఏర్పడి నీతోనే వున్నప్పుడు నీ వింతలు, నీ విషయాలు, నీ విశేషాలు, నా విశేషాలలో నేను ఇరుక్కుపోకుండా నన్ను కాపాడిన నీ క్షమకు కృతజ్ఞతులు.

❋ నిన్ను, నీ ఔదార్యాన్ని, నీ చతురతను, నీ క్షమను, నీదైన తీరును గమనిస్తున్నప్పుడు నా కోసమే కదా నీవు ఒక గురువుగా, రక్షకుడిగా, పాలకుడిగా, మార్గదర్శిగా మారావు అనిపించింది. నాకోసమే కరుణ, దయ, ప్రేమ అనే వస్త్రాలు ధరిస్తున్నావు అని అర్ధమైనది. నీవు నాకోసము ఎంత త్యాగము చేసావో అర్ధమైనది. నీవు పొందుతున్న సుఖం నేనూ రుచిచూసాను కదా, ఆ సుఖాన్ని నీవు కేవలం నా ఉద్ధరింపుకోసం త్యజించావని అర్ధమైంది. నాకోసము నీవు సుఖాన్ని వదులుకుని రెండో వస్తువుగా మారడం జీర్ణించుకోలేక నీవు నీవుగానే వుండు తండ్రీ!" అని ప్రార్థించాను. దానికి ప్రతిగా నీవు నాలోని ఎడతెగని శ్రద్ధని పెంచి పోషించి దానినే ఆధారం

చేసుకుని నన్ను నీ నివాస స్థలముగా నీ మందిరంగా మార్చావు. ఇంక నాలో వున్న నువ్వు గురువుగా దైవంగా దివ్యత్వంగా కాక నాలాగానే నీదైన నిజంలోనే వుంటావు. నా ప్రార్ధనను ఆలకించి దానిని ఫలింపచేసిన నీకు కృతజ్ఞతలు.

❋ నువ్వు నువ్వుగా వుండు దేవా! అని ప్రార్ధించినందుకు నువ్వు అలా వుండటమే కాక నన్ను నన్నుగా కూడా నిల్పావు. ఎన్ని పొందింప చేసావో అన్నిటికీ అతీతము చేసి నన్ను నన్నుగానే (అహాన్ని) నిల్పి నందుకు కృతజ్ఞతలు. నిన్ను నిజ స్థితిని అనుభవించమని అడిగాను, నా చేత కూడా దానిని అనుభవింప చేసావు దానికి కృతజ్ఞతలు.

❋ నన్ను నన్నుగా నిలిపి, నాలోని ఆరాటాలను వాటి తీర్చుకోవటానికి చేసే పోరాటాలను ఆపి నాకు ప్రశాంతతను కల్పించావు దానికి కృతజ్ఞతలు

❋ నాలోపాలను నీకు విన్నవించుకొనేలా చేసి వాటిని కొట్టివేసిన నీ చాకచక్యానికి కృతజ్ఞతలు.

❋ నా చేత నా నిజాన్ని (భ్రమలు లేని సహజ సత్తాగా పరిపూర్ణంగా వుండటం) నీ నిజాన్ని (తను తానుగా

వుండటం) అనుభవింప చేసి ఆ అనుభవాన్ని తిరిగి నీకు విన్నవించుకోగలిగే జ్ఞానాన్ని నాకు ప్రసాదించి నందుకు కృతజ్ఞతలు.

❈ ఇంత స్పష్టంగా నా అనుభవాన్ని నీకు వ్యక్తం చేసుకోగల్గాను అంటే, జీవి నిజాన్ని అనుభవించి తీరాల్సిందే అన్న నీ ఉద్దేశము ఎంత బలమైనదో కదా! ఇంతటి అనుభవానికి కారణమైన నీ ఉద్దేశానికి అనంతకోటి నమస్కారాలు కృతజ్ఞతలు తెలుపు కుంటున్నాను.

❈ నేను నా అనుభవంతో సహా నా సమస్తముతో సహా నిన్నే యజమానిగా స్వీకరిస్తున్నాను. నా యజమాని వైనందుకు నీకు కృతజ్ఞతలు.

**సమస్తాన్ని తనలో కలిగి వుండి సమస్తమూ నిండివున్న అఖండ పరిపూర్ణ పరబ్రహ్మను నా యజమానిగా స్వీకరిస్తున్నాను, సర్వాధారుడైన నా ప్రభువు నిరాధారంగా నాపై కృపను వర్షిస్తున్నారని విశ్వసిస్తున్నాను, నా సమస్తానికి ప్రభువు అయిన అఖండ పరిపూర్ణ పరబ్రహ్మకు నా కృతజ్ఞతలు.**

**గిరిధర్‌వాణి ఆనందనందనం**

27-02-2011